విశాలాంధ్ర అనకాపల్లి
పేజి నెం. 6
బుధవారం 08, అక్టోబర్ 2025

ఉపాధి హామీ పథకం వేతనదారుకు ఈ కేవైసీ తప్పనిసరి : డ్వామా పిడ్ పూర్ణిమదేవి

విశాలాంధ్ర-అనకాపల్లి: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వారి ఆదేశాల మేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పని చేస్తున్న వేతనదారులకు "ముఖ ఆధారిత" హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా నమోదుకు జిల్లాలో అక్టోబర్ 4వ తేదీ నుండి వేతనదారులు అందరికి ఇ కె వై సి చేయడం జరుగుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థపథక సంచాలకులు ఆర్. పూర్ణిమ దేవి తెలిపారు. ఇ కె వై సి లో భాగంగా వేతనదారుని ముఖమును ఆధార్ కార్డ్ లో ఉన్న ముఖముతో పోల్చి నమోదు చేయడం జరుగుతుంది ఇ కె వై సి ముఖ్య ఉద్దేశ్యం ఉపాధి హామీ పథకంలో ఒకరికి బదులు మరొకరు పనికి రాకుండా నియంత్రించే%శీ%దుకు ముఖ ఆధారిత ద్వారా హాజరు వేసే పద్ధతి ప్రారంభం కానున్నందున ఇకెవైసి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా లో ఉపాధి హామీ పనులకు వచ్చేవారి సంఖ్య 3,68,156 మంది కి ఇకెవైసి గ్రామ గ్రామమున జరుగుతుంది. కావున వేతనదారులు అందరూ వారి ఆధార్ కార్డ్ లు, జాబ్ కార్డ్ తో క్షేత్ర సహాయకుడి వద్ద ఇకెవైసి పూర్తి చేయించుకోవాలని తెలిపారు.

మాడుగులలో సూపర్ జీఎస్టీపై అవగాహన

విశాలాంధ్ర-వి.మాడుగుల: మాడుగులలో మంగళవారం జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అన్నారు. జీఎస్టీపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ప్రతి షాప్ దారులకు జీఎస్టిపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నందారపు సన్యాసిరావు, మండల కార్యదర్శి పుప్పాల రమేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ, బిజెపి నాయకులు పుట్టా గంగయ్య, వద్దాది వరలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు గల్రెడ్డి శివాజీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు లెక్కల కాశిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లగొండమ్మ తల్లి పండుగ

విశాలాంధ్ర-నాతవరం: మండలంలోని మంగళవారం తాండవ, గుమ్మడి కొండ, నాతవరం గ్రామాలలో శ్రీశ్రీశ్రీ నల్ల గోండమ్మ తల్లి పండుగను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. నాతవరంలో ఆలయ కమిటీ వారు ఏర్పాటుచేసిన గుర్రపు పందాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాతవరం పోలీసు వారు తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది.

అమృతపురం అంగన్వాడీ కేంద్రానికి అవార్డు

విశాలాంధ్ర-సబ్బవరం: అమృత పురం అంగన్వాడి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అమృతపురం అంగన్వాడి కార్యకర్త గండి అరుణకుమారి అవార్డుకు ఎంపిక అయింది. ఈ మేరకు అనకాపల్లి పెంటకోట కళ్యాణ మండపం లో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, వి.మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతులమీదుగా విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అంగన్వాడి కార్యకర్త గండి అరుణకుమారి అమృతపురం గ్రామం1అంగన్వాడీ టీచరు ముగ్గురు చేతులు మీదుగా అవార్డు తీసుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిడి సూర్యలక్ష్మి,సబ్బవరం ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఓ వి.లలిత కుమారి, డి అప్పల నరసమ్మ సూపర్వైజర్ హాజరయ్యారు అలాగే సబ్బవరం ప్రాజెక్టు నుంచి 15 మంది అంగన్వాడీ కార్యకర్తలు సూపర్వైజర్లు కూడా హాజరయ్యారు.

రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన గుంటపల్లి విద్యార్థులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: రాష్ట్రస్థాయి బీచ్‌వాల్ పోటీలకు మండలంలోని గుంటపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక య్యారు. రేవుపోలవరం లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అండర్ -14 బాలికల విభాగంలో డి.రాణి, డి.బాలశ్రీ, బాలురు విభాగంలో జి. అస్మిత్ బాబు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు ఆర్. వెంకన్న, పిడి టి. రవికుమార్ తదితరులు అభినందించారు.

ఆశా వర్కర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-నక్కపల్లి: మండలంలో మంగళవారం ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపుమేరకు గోడిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్ల బకాయిలు కనీస వేతనాలు తక్షణమే చెల్లించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని పనికి తగిన వేతనం చెల్లించడం లేదని గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. తక్షణమే ఆశా వర్కర్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం రాజేష్ ఆశ వర్కర్ సీనియర్ నాయకులు తులసి శిరీష వరలక్ష్మి వెంకటి కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-మునగపాక: ఆశా కార్యకర్తల సమస్యలు, పీ హెచ్సీ వైద్యులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆశ కార్యకర్తలు స్థానిక పిహెచ్సి వద్ద నిరసన చేపట్టారు.అనంతరం పిహెచ్సి వైద్యురాలు నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి ఈ పార్వతి మాట్లాడుతూ పేద ప్రజలకు 20 ఏళ్లుగా ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్ కు నేటి వరకు కనీస వేతనాలు చెల్లించకపోవడం బాధాకరం అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల నియామకం జరగలేదన్నారు.కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని,అప్పటివరకు ఆశాలతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు,వేతనాలతో పాటుగా రెండు నెలల జీతం వెంటనే చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ, ఆశా వర్కర్లు కుమారి,వీర కోట,వెంకటలక్ష్మి, అరుణ,జయపద్మ తదితరులు పాల్గొన్నారు

అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవడమే కూటమి సర్కార్ లక్ష్యం

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

విశాలాంధ్ర-మునగపాక:అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవడమే కూటమి సర్కార్ లక్ష్యమని యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ అన్నారు.మండలంలో నాగులాపల్లి పీఏసీఎస్ సంఘ సభ్యులకు,రైతులకు మంగళవారం ఎమ్మెల్యే విజయకుమార్ డివిడెండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)ల ద్వారా రైతులకు మేలు చేకూర్చడమే ధ్యేయంగా ఆయా సంఘాల చైర్మన్లు,పాలకవర్గ సభ్యులు,సిబ్బంది పనిచేయాలని కోరారు.నాగులాపల్లి పీఏసీఎస్ లో గల 3655 మంది సభ్యులకు వారి షేర్ ధనంలో 15శాతం చొప్పున డివిడెండ్ల కింద మొత్తం 6 లక్షల 60 రూపాయలను అందజేయడం అభినందనీయమన్నారు. అలాగే ఇటీవల కేంద్ర ప్రభుత్వం తగ్గించి జీఎస్టి ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని,దీనిపై ప్రతీ రైతు అవగాహన కల్పించుకొని వినియోగించుకోవాలన్నారు.రైతులకు ఉపయోగపడే అన్నిరకాల పనిముట్లు,యంత్రాలు,పరికరాలపై 12శాతం నుంచి 5శాతంకు జీఎస్టి తగ్గించారని,దీనివలన ప్రతీరైతుకు మేలు చేకూరుతుందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ లు రాష్ట్రంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారని,ముఖ్యంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని విజయకుమార్ పేర్కొన్నారు.పీఏసీఎస్ చైర్మన్ యల్లపు వెంకట భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సుందరపు శ్రీనివాసరావు,కొంతం పార్వతీ జగదీశ్వరరావు,సంఘ సీఈవో మళ్ల స్వామి,జనసేన మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం,బీజేపీ మండల నాయకులు మళ్ల కాళేశ్వరరావు,మునగపాక పీఏసీఎస్ చైర్మన్ విల్లూరి నూకనర్సింగరావు,దాడి ముసలినాయుడు,నీటి సంఘం అధ్యక్షులు దొడ్డి వీరవెంకటరావు,జెకె నాయుడు,సుందరపు ధనలక్ష్మి,హైస్కూల్ కమిటీ చైర్మన్ పొలమరశెట్టి నూకాలయ్య,పెతకంశెట్టి రాజునాయుడు, దొడ్డి శివ,సంఘ సభ్యులు,పిఎసిఎస్ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే..

- చిగురుటాకుల వణికి పోతున్న ఆర్. శివరాంపురం గ్రామస్తులు...
- కల్వర్టు నిర్మించాలని కోరుతున్న ఐటీడీపీ నాయకులు నమ్మిరాజు

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మండలంలోని ఆర్ శివరామపురం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్ అప్పటి అధికారులు,నాయకులు ముందస్తు ప్రణాళిక లేకుండా గ్రామంలో ప్రభుత్వ భూమి చాలా ఉన్నప్పటికీ లోతట్టు ప్రాంతంలో ఏర్పాటు చేయడం వలన గృహ నిర్మాణ లబ్ధిదారులుకు సరైన ప్రణాళిక తెలియపరచకపోవడంతో అస్తవ్యస్తంగా గృహ నిర్మాణాలు చేపట్టడం వలన చినుకు పడితే చాలు ఆ కాలనీ వాసులు బెంబెలెత్తుతున్నారు. కల్వర్టు నిర్మాణం లేక నేరుగా కాలనీ ఇళ్లలోకి మొత్తం వరద పోటెత్తి పరిసర ప్రాంతాలు జలమయమై ఎక్కడ కాలుపెడితే ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధించిన అధికారులు ఈ కాలనీకి రోడ్డు మార్గం వైపు సైడ్ కాలువలు నిర్మించి కల్వర్టు నిర్మాణం చేపట్టి కాలనీకి సీసీ రోడ్డులు ఏర్పాటుచేసి వీధి కాలవలు ఉంటే ఈ పరిస్థితి కొంతమేర చక్కదిద్ద వచ్చని కానీ అధికారులు ఆ దిశగా ప్రణాళికలు అమలు చేయడం లేదని స్థానిక శాసనసభ్యులు ఈ సమస్యను పరిష్కరించి కాలనీ వాసులకు ముంపు బెడద తొలగించాలని మండల ఐటీడీపీ అధ్యక్షులు నమ్మి రాజు కోరుతున్నారు.

తోటాడ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా గ్రామసభ

విశాలాంధ్ర-మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ గ్రామసభ ఇక్కడి సచివాలయంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పాలక వర్గ%శీ% ఏర్పడిన నాటి నుంచి నేటి దాకా పంచాయతీ గ్రామాల్లో జరిగిన అభివృద్ధిపై ప్రధానంగా చర్చించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ రెండు గ్రామాలను రెండు కళ్లుగా భావిస్తూ అభివృద్ధి పనులు చేపట్టామని ఇందుకు ఇరు గ్రామాల ప్రజలు ఎంతగానో సహకరించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీని మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఎంతగానో సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు. అందుకు పాలకవర్గం తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. గ్రామాల్లోని చెత్త డంపింగ్ వలన స్మశాన వాటిక పరిసరాలు అధ్వాన్నంగా తయారవుతున్నాయని పలువురు పాలక వర్గం దృష్టికి తీసుకురాగా స్మశాన వాటిక అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారని అవి కూడా త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. పంచాయతీలో పనికి ఆహార పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ శ్రీలక్ష్మి, కూటమి నేతలు దొడ్డి రమేష్, పొలమరశెట్టి మురళీ, ఆడారి ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెకు మద్దతుగా సిటూ నిరసన

విశాలాంధ్ర-పరవాడ : సెప్టెంబర్ 26వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించు కోకపోవడం అన్యాయమని వారి డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం వాడ చీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ అక్టోబర్ 4న చలో విజయవాడ నిర్వహించి పీ.హెచ్.సీ వైద్యుల సమస్యలపై ప్రభుత్వం పరిష్కరించాలని నిరసన చేపట్టినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ అధికారులతో జరిగిన చర్చల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో విఫలం కావడంతో అక్టోబర్ 5 నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న డాక్టర్స్ జీవో 99 ద్వారా కోత విధించడం అన్యాయమన్నారు. ఇన్ సర్వీసులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోటా పునరుద్ధరించాలని, సమయం, ప్రమోషన్స్, ట్రైబల్ అల్బమ్స్, 104 సంచార చికిత్స అలవెన్స్, నేషనల్ ఇంక్రిమెంట్ వంటి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. డాక్టర్లు చేస్తున్న సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో లక్ష్మి, దేవుడమ్మ, సైదులమ్మ, వరలక్ష్మి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-యస్ .రాయవరం: మండలంలోని చిన్న గుమ్ములూరు దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపి కయ్యారు .విశాఖపట్నంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో చిన్న గుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల నుంచి అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు సిహెచ్. భవ్య శ్రీ ,కె .దీపిక, అల్లు హేమంత్ ఎంపిక చేశారు .దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన జిలుగుల తారక లక్ష్మి పినపోలు భార్గవి లు ఎంపిక అవ్వడం జరిగింది. ఈ ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు శకుంతల జాన్ మెతుషెలా వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, నిర్మల ,సోమేశ్వరి అభినందనలు తెలియజేశారు. ..

ఆర్ భీమవరంలో పిడుగుపడి పాడి ఆవు మృతి

విశాలాంధ్ర- బుచ్చయ్య పేట: మండలంలో ఆర్. భీమవరం గ్రామం లో మంగళవారం కురిసిన భారీ వర్షానికి గ్రామానికి చెందిన రొంగలి చిన్నమనాయుడు తండ్రిరాములు చెందిన పాడి ఆవు ప్రమాదవశాత్తు పిడుగుపడి మృతి చెందింది. ఈ ఘటనలో జరిగినప్పుడు సమీపంలో ఉన్న రైతు చిన్నానా యుడు భయానికి లోనై వెంటనే పారిపోవడంతో ప్రాణాపాయ నుండి తప్పించుకున్నాడు. తమకు జీవనాధారమైన ఆవు మృతి చెందడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు చిన్నం నాయుడు కోరారు. అనంతరం గ్రామస్తులందరూ మృతి చెందిన అవు ను ఖననం చేశారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



విశాలాంధ్ర- వి.మాడుగుల: ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యా కమిషనర్ వారి ఆదేశాల మేరకు మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, అర్థశాస్త్ర విభాగాలు సంయుక్తంగా సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ఎస్.శాస్త్రి అధ్యక్షోపన్యాసం చేస్తూ పేద, మధ్యతరగతి వర్గాలకు, అల్పాదాయ వర్గాలకు మేలు కలిగే లాగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 సెప్టెంబర్ 22 నుంచి అమలువరుస్తుందని ఈ విషయంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడమే కాకుండా తమ కుటుంబ సభ్యులకు ఇతర పౌరులకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వలన ప్రజల రోజువారి వినియోగ వస్తువులు ధరలు తగ్గుతాయని తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగు తుందన్నారు. వాణిజ్య శాస్త్ర ఉపన్యాసకులు అంబేద్కర్ రాజు జీఎస్టీ 2.0 వలన ఏఏ వస్తువుల ధరలు తగ్గుతాయో కూలంకషంగా విద్యార్థులకు వివరించారు. అర్థశాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ ఎస్.పుల్లారావు ప్రసంగిస్తూ జీఎస్టి 2.0 వలన ప్రజల వినియోగ శక్తి పెరిగి దేశ ఆర్థికవృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉపన్యాసకులు డాక్టర్ పులవర్తి పైడిరాజు, డాక్టర్ జె. షర్మిలశ్రీ, బి.రాజు, వి.అప్పలనాయుడు, బి.నారాయణ, ఎం.రామ్‌కుమార్, బోధనేతర సిబ్బంది సులేమాన్, శ్రీనివాసు, విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-మునగపాక: నర్సీపట్నంలో ఈ నెల 9న జరగనున్న మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్,యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు.స్థానిక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో మండల సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకోవడం దారుణమన్నారు.దీనిలో భాగంగా నర్సీపట్నం మెడికల్ కళాశాలను సందర్శించేందుకు వస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు, జడ్పీటీసీ పెంటకోట సోము సత్యనారాయణ,మండల సర్పంచ్ అధ్యక్షులు కాండ్రేగుల నూకరాజు,మాజీ జడ్పీటీసీ మళ్ల సంజీవరావు,మండల మహిళా పార్టీ అధ్యక్షులు శీరా రమణమ్మ,టి. సిరసపల్లి సర్పంచ్ సుందరపు తాతాజీ,మునగపాక గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు,మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్రావు, వైసీపీ నేత ఆడారి కాశీబాబు,ఎంపీటీసీలు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కన్నబాబు ని కలిసిన వైసిపి నాయకులు

విశాలాంధ్ర-యలమంచిలి: ఎలమంచిలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే యు వి రమమూర్తి రాజు ని పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నెంబర్ గా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కన్నబాబు రాజుని వారి నివాసమందు ఏటికొప్పాక జడ్పిటిసి సేనాపతి సంధ్య రాము, అనకాపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, త్రినాధరావు, వైసీపీ పార్టీ నాయకులు యు వి రమణ మూర్తి (కన్నబాబు రాజు)కలిసి అభినందనలు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో నిర్బంధం సరికాదు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న

విశాలాంధ్ర-పాయకరావుపేట: ప్రజాస్వామ్యంలో నిర్బంధాలు సరికాదని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న అన్నారు. నక్కపల్లి మండలం, రాజయ్యపేట గ్రామంలో అక్కడ ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులకు సంఘీభావం తెలిపేందుకు అక్కడికి వెళుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను పాయకరావుపేట పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఈ సందర్భంగా మీసాల సుబ్బన్న మాట్లాడుతూ గత 24 రోజులుగా రాజయ్యపేట మత్స్యకారులు బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దతు ప్రకటించేందుకు వెళుతున్న పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవటం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త మారుతి నారాయణ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి పోలవరపు అప్పలరాజు, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ గుమ్మెళ్ళ గోవిందరావు, జిల్లా జనరల్ సెక్రెటరీ మేడేటి శంకర్, నక్కపల్లి మండల అధ్యక్షులు ప్రగడ చక్రరావు, కోటవురట్ల మండల అధ్యక్షులు నడింపల్లి నూకరాజు, ఓబిసి వైస్ చైర్మన్ బర్రె జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్వచ్ఛ గ్రామ పంచాయతీగా చౌడువాడకు అవార్డు

విశాలాంధ్ర-కే కోటపాడు: రాష్ట్రస్థాయి స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ఎంపిక అయిన చౌడువాడ సర్పంచ్ కార్యదర్శిలు దాడి ఎరుకు నాయుడు సురేష్ బాబు లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సోమవారం అవార్డు ప్రశంసా పత్రం అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం లో నిర్వహించిన స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డుల ప్రధానోత్సవం లో సర్పంచ్ కార్యదర్శి పాల్గొన్నారు. 2025 కు రాష్ట్రస్థాయిలో ఆరు మునిసిపాలిటీలు ఆరు గ్రామపంచాయతీలను ఎంపిక చేయడం జరిగింది. ఇందులో అనకాపల్లి జిల్లా లో చౌడువాడ పంచాయితీ ఎంపిక కావడం పట్ల మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయ ణమూర్తి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డును ఒక బాధ్యతగా తీసుకుని చౌడువాడ పంచాయతీని ఎమ్మెల్యే బండారు సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని సర్పంచ్ ఎరుక నాయుడు స్పష్టం చేశారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-పాయకరావుపేట : మండలంలోని పాల్మాన్ పేట సముద్ర తీరంలో అలల తాకిడికి సముద్రంలో కొట్టుకుపోయిన వి.అశోక్ మృతదేహం కొర్లయ్య పేట సముద్ర తీరానికి కొట్టుకు వచ్చింది. నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న అశోక్ స్నేహితులతో కలిసి పిక్నిక్ వచ్చిన సంగతి తెలిసిందే. భోజనం అనంతరం అశోక్ చేతులు కడుక్కుంటుండగా ఎగసిపడిన అలలకు సముద్రంలో కొట్టుకుపోయాడు. గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభించలేదు. మంగళవారం తెల్లవారుజామున అశోక్ మృతదేహం కొర్లయ్య పేట సముద్ర తీరానికి కొట్టుకు వచ్చింది.

రోలుగుంటలో పరిష్కారమైన గిరిజనుల సమస్య...

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-రోలుగుంట: రోలుగుంట మండలం లోని అర్ల పంచాయతీ నీళ్లబంద, రావికమతం మండలం సోంపురం బంద గ్రామాల్లో మూడు నెలలుగా విద్యుత్ లేక చీకట్లో మగ్గుతున్న గిరిజనుల సమస్య రిపోర్టర్ రాజేష్ పొట్ల సోమవారం ఉదయం విశాలాంధ్ర వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశారు. గ్రామస్తుల వాపోతలను వివరించిన కథనం వెంటనే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఏఈ రమేష్, ఏడీఈ త్రినాధ్ రావు, రోలుగుంట లైన్మెన్ గోపాల్, స్థానిక లైన్మెన్ చందు తక్షణమే స్పందించారు. అదే రోజు సాయంత్రం, వారు యుద్ధ ప్రాతిపదికన పాత ట్రాన్స్ఫార్మర్ తొలగించి కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. గ్రామస్థులు తక్షణమే విద్యుత్ పునరుద్ధరించ బడినందుకు హర్షం వ్యక్తం చేశారు. "చీకట్లో మగ్గుతున్న మా జీవితానికి ఇప్పుడు వెలుగు వచ్చింది" అని వారు ఆనందం వ్యక్తం చేశారు. రిపోర్టర్ రాజేష్ పొట్ల తక్షణమే సమస్యను గుర్తించి, స్పష్టంగా, సమగ్రంగా ప్రతినిధులకు మరియు పాఠకులకు అందించడం ద్వారా సమస్య తక్షణమే పరిష్కారం పొందింది. ఇది స్థానిక జర్నలిజం సమర్థతకు ఒక ఉదాహరణగా నిలిచింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ నీటి పారుదల సంస్థ: అనకాపల్లి విభాగము

షార్ట్ టెండర్ ప్రకటన

Tender notice No: 02/EE/RIC/AKP/2025-26 తేదీ: 07-10-2025

అనకాపల్లి జిల్లా యందు 12.00లక్షల అంచనా విలువ గల వివిధ గ్రాంట్స్ క్రింద మంజూరు అయిన 02 పనుల కొరకు సీలు వేసిన టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ షెడ్యూల్ దరఖాస్తు చివరి తేదీ 10.10.2025 టెండర్ స్వీకరణకు చివరి తేదీ 17.10.2025 మ.3.30గంటల వరకు

మిగతా వివరములకు కార్యాలయ పని వేళ యందు సంప్రదించ వలసినదిగా కోరడమైనది.

కార్యనిర్వాహక ఇంజనీర్

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న

విశాలాంధ్ర-పాయకరావుపేట: దొంగ ఓట్లతో బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కిందని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న ఆరోపించారు. ఓట్ చోరీ - గద్ది చోడ్ కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేటలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మారుతి నారాయణ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ స్విస్ బ్యాంకు లో ఉన్న నల్లధనాన్ని బయటకు తీసుకొస్తానని, రూ.15 లక్షల చొప్పున పంచుతానని మోసం చేసి బిజెపి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలక్షన్ కమిషన్ ను గుప్పెట్లో ఉంచుకొని ఓట్ చోరీకి పాల్పడిందని విమర్శించారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లుగా నమోదు చేసిన వారితో ఇటీవల రాహుల్ గాంధీ కాఫీ తాగిన విషయాన్ని గుర్తు చేశారు. బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోలవరపు అప్పలరాజు, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ గుమ్మెళ్ళ గోవిందరావు, జిల్లా జనరల్ సెక్రెటరీ మేడేటి శంకర్, నక్కపల్లి మండల అధ్యక్షులు ప్రగడ చక్రరావు, కోటవురట్ల మండల అధ్యక్షులు నడింపల్లి నూకరాజు, ఓబిసి వైస్ చైర్మన్ బర్రె జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

బకాయి వేతనాలు చెల్లించాలి...

విశాలాంధ్ర-చోడవరం: గ్రామీణ ప్రాంతా ల్లో సుమారు 20 ఏళ్లకు పైగా ప్రజా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తల అపరిష్కృత సమస్యలు తక్షణమే పరిష్కరించాల్సిందిగా కోరుతూ మండలంలోని గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఆశ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి కురచా వరలక్ష్మి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, ఏ.ఎన్.ఎం., జి.ఎన్.ఎమ్. శిక్షణ పొందిన ఆశా కార్యకర్తలకు పర్మనెంట్ పోస్టులు భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలని, పీ.హెచ్.సి., సి.హెచ్.సి.ల కు వెళ్లేందుకు టి.ఎ, డి.ఏ చెల్లించాలని, యూనిఫామ్ ....ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించాలని తదితర అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఆగస్టు, సెప్టెంబర్ బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు అనంతరం వినతి పత్రాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. సంతోష్ కుమారి, బి.లక్ష్మి, బి.వెంకటలక్ష్మి, సంధ్య, తార, కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో నాగులపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం శ్రీగౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహెూత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.దీనిలో భాగంగా గ్రామంలో రావి చెట్టు వద్ద గల శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయం నుంచి సంతబైల వరకు స్వర్గీయ మద్దాల అప్పల నరసింహ%శీ% కుటుంబ సభ్యులు మరియు గ్రామ పెద్దలు,మహిళలు ఆధ్వర్యంలో మేళ తాళాలతో సేవాకర్ధీలతో బాణా సంచారం వెలుగులతో ఊరేగింపు గా వెళ్లి వరి దుబ్బులు తీసుకువచ్చి ఆలయంలో ఉంచారు.అనంతరం అక్కడి నుంచి విశ్వబ్రాహ్మణుల ఇంటికి వెళ్లి అక్కడ వారు తయారు చేసిన శ్రీ గౌరీ పరమేశ్వరుల విగ్రహాలు పురవీధుల్లో ఊరేగించి ఆలయంలో ప్రతిష్టించారు.అనంతరం శ్రీ గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించి,అందరికీ ప్రసాదాలు వంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యల్లవు వెంకటభాస్కరరావు, పెతకంశెట్టి రాజునాయుడు,పొలమరశెట్టి నాగు,ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్,హైస్కూల్ కమిటీ చైర్మన్ పొలమరశెట్టి నూకాలయ్య,బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు మళ్ల కాశేశ్వరరావు,ఎమ్.జె నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌరీ పార్వతులకు పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర-చోడవరం: స్వయంభు దేవాలయాలన్నింటిలో అతి ప్రాచీనమైన, పురాణ చరిత్ర కలిగిన చోడవరం శ్రీ గంగా సమేత గౌరీశ్వర స్వామి స్వయంభూ దేవాలయాల్లో ఉపాలయంగా కొలువదీరిన గౌరీ పార్వతులకు మంగళవారం భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు నిర్వహించారు వేకువజాము నుండి అమ్మవారికి శ్రీ సూక్త పూర్వకంగా పంచామృత అభిషేకములు, సామూహికంగా హరిద్ర, కుంకుమ అభిషేకములు, నూతన వస్త్ర అలంకరణ నానావిధ రత్న ఆభరణాల సమర్పించారు. మహిళలచే సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం జరిపించినట్లు ఆలయ ప్రధానార్చకులు కొడమంచిలి చలపతిరావు తెలియజేశారు. అనంతరం 12 గంటల నుండి స్వయంభు గౌరీశ్వర స్వామి సన్నిధిలో దాతలు సహాయ సహకారాలతో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూనూరు సురేష్, ఈవో ఎస్.వి.వి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-అనకాపల్లి: మహర్షి వాల్మీకి ఆలోచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు.మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో మహర్షి వాల్మీకి చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఘనంగా పుష్పమాలాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ.మహర్షి వాల్మీకి భారతీయ సాహిత్యంలో ఆదికవిగా నిలిచారని, ఆయన రచించిన రామాయణం ప్రపంచానికి నిత్యనూతనంగా మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. వాల్మీకి మహర్షి జీవితం సమానత్వం, ధర్మం, న్యాయం, శాంతి వంటి విలువలకు ప్రతీక అని కలెక్టర్ పేర్కొన్నారు. యువత ఆయన చూపిన మార్గంలో నడవాలని, సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ.సురేంద్ర, బోయ కమ్యూనిటీ నాయకులు ఆదినారాయణ, జయకృష్ణ, అంగులురి శ్రీను, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, ఇతర బి.సి. సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవిపురంలో ఘనంగా ముగిసిన దసరా బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-సబ్బవరం: మండలం లోని దేవిపురంలో శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో దసరా బ్రహెూత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా ముగిశాయి. అశ్వయుజ పౌర్ణమి తిథినాటి పురస్కరించుకొని సహస్రాక్షి రాజా రాజేశ్వరి రూపంలో అమ్మవారిని భక్తులకి దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటల నుండి వివిధ ప్రాంతాలనుండి వచ్చిన అనేక మంది భక్తులు అమ్మవారి కి పంచామృతాభిషేకం చేశారు. అలాగే లలితా సహస్ర నామావళి హెూమం జరిగింది. ?ప్రతి ఏడాది జరుగుతున్నట్లు గా శ్రీ శ్రీ శ్రీ సహస్రాక్షి అమ్మవారికి రాజా రాజేశ్వరునికి వేదపండితుల వేద ఘోషతో కన్నుల పండుగ గా కళ్యాణ మహెూత్సవం జరిగింది.సాయంత్రం విశాఖపట్నం ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారిచే భజన కార్యక్రమం భక్తులను బాగా ఆకట్టుకున్నాయి.గురుమాత అందరినీ దీవించి అన్న సంతర్పణ ఉచితంగా అందజేశారు. ఈ పూజా కార్యక్రమంలో దేవిపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ పర్యవేక్షణలో నిర్వహించారు.

మహిళా శక్తి ఆధ్వర్యంలో అగరబత్తుల తయారీ

విశాలాంధ్ర-నాతవరం : నాతవరం మండలం మాధవనగరం గ్రామంలో శ్రీనల్లకొండమ్మ పండుగ సందర్భంగా చమ్మచింత మహిళా శక్తి ఆధ్వర్యంలో మహిళలు స్వయంగా ఆర్గానిక్ అగరబత్తులను తయారు చేశారు. ఈ అగరబత్తుల ప్రొడెక్ట్ ను జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఈ ప్రొడక్ట్ ను ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ మహిళలు స్వయంగా ఆర్గానిక్ అగరబత్తుల తయారు చేసి పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వపరంగా వీరికి అవసరమైన రుణాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చమ్మచింత శ్రేయోభిలాషి నానాజీ, ఆలయ ధర్మకర్త కూనిశెట్టి జోగురాజు, మహిళలు అనూష, సుజాత, తులసి, ధనలక్ష్మీ, మేరీ తదితరులు పాల్గన్నారు.

వైయస్ జగన్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు

ముందస్తు చర్యగానే స్టాపర్లు ఏర్పాటు చేసిన పోలీస్ సిబ్బంది

ఎన్ని అడ్డంకులు సృష్టించిన అభిమానాన్ని ఆపలేరు : అమర్నాథ్

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: ఈనెల 9వ తేదీన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం మెడికల్ కాలేజ్ సందర్శన నిమిత్తం రోడ్ షోల ద్వారా పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆయన పర్యటనకు రోడ్డు మార్గం ద్వారా వెళ్లడానికి భద్రతా కారణాల రీత్యా రోడ్డు మార్గం ద్వారా వెళ్లడానికి ఎటువంటి అనుమతి లేదని జిల్లా ఎస్పీ తెలపడంతో శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యగా స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది అసాంఘిక శక్తులను అడ్డుకునే నిమిత్తం మండలంలోని రాజాం, సీతయ్యపేట, మల్లం వంటి ప్రాంతాలలో రోడ్డు స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చోడవరం వైఎస్ఆర్ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ కుటమీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన అభిమానాన్ని అడ్డుకోలేరని ఎట్టి పరిస్థితుల్లోనూ జగన్మోహన్ రెడ్డి పర్యటన విజయవంతం చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.దీనిపై ఏం జరుగుతుందోనని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మహిళకు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-పరవాడ: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు బీజేపీ నాయకుడు కూండ్రపు సోమినాయుడు, పరవాడ బ్యాడ్ బాయ్స్ ఆర్థిక సాయం అందజేశారు. పరవాడ గ్రామానికి చెందిన బారపు లక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికి తోడు ఆర్థిక పరిస్థితుల కారణంగా వైద్య ఖర్చులకు సైతం డబ్బులు లేక ఆమె తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. ఈ విషయం గురించి తెలుసుకున్న బ్యాడ్ బాయ్స్ ప్రతినిధులు స్థానిక బిజెపి నాయకుడు కూండ్రపు సోమునాయుడుని సంప్రదించారు. దీంతో వీరంతా కలిసి ఆ కుటుంబా నికి అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. మొత్తంగా రూ. 70 వేలు సమకూర్చారు. మంగళ వారం ఆ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాడ్ బాయ్స్ సభ్యులను సొమునాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు నరవ నాగరాజు, బీజేపీ, బ్యాడ్ బాయ్స్ సభ్యులు బండారు అజయ్, లాలం సురేష్, దండి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కబేళాలకు తరలిపోతున్న పశు సంపద ....

విశాలాంధ్ర-చోడవరం: మండలంలోని ఖండేపల్లి గ్రామం నుండి నాణ్యమైన, మేలు జాతి.... నాటు ఆవులు వందలు, వేల సంఖ్యలో యదేచ్ఛగా కబేళాలకు తరలిపోతున్నాయి. జిల్లాలో పశు సంపదను అక్రమ మార్గంలో తరలించేందుకు ఖండేపల్లి గ్రామం పెట్టింది పేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. సామాజిక పాడి పరిశ్రమను పూర్తిగా మానివేసి ఆవులను, ఎద్దులను సంతల్లో విక్రయించి,... వాటిని సామర్ల కోట, హైదరాబాద్ కు లారీల్లో రాత్రి 11 గంటల కు ఖండేపల్లి గ్రామం నుండి శుక్రవారం, సోమ వారం రాత్రుళ్ళు యదేచ్ఛగా పశువులను రవాణా చేస్తున్నారని గ్రామస్తులు, ప్రజా సంఘాల వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కాసులకీ కక్కుర్తి పడి పశువుల వ్యాపారులకు, అక్రమార్కుల కు సహకరిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు పాలకులు అశ్రద్ధ వహిస్తే పశుసంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉందని జంతు ప్రేమికులు ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. పశు సంపదను కబేళాలకు తరలిస్తున్న అక్రమార్కులు పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.